అదనపు భారం తగ్గించుకుందాం

- విద్యుత్ ఓవర్‌లోడ్ రెగ్యులరైజేషన్‌కు మరో అవకాశం
- 50 శాతం సబ్సిడీ ప్రకటించిన ప్రభుత్వం 6లో
- డిసెంబరు 31 వరకూ గడువు



ఉంచుతారా?.. పంపిస్తారా?

- సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో బదిలీపై ఉత్కంఠ
- ఇంతవరకు యశ్వంత్‌కుమార్‌రెడ్డికి పోస్టింగ్ ఇవ్వని వైనం
- రెగ్యులర్ పీవోగా ఆయనకే బాధ్యతలు?
- ఏక్షణమైనా ఉత్తర్వులు వెలువడే అవకాశం

సీతంపేట రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి)

సీతంపేట ఐటీడీఏ రెగ్యులర్ పీవోగా ఎవరిని నియమిస్తారనే దానిపై ఇంతవరకు స్పష్టత లేదు. పాలకొండ సబ్‌కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి గత ఏడాది సెప్టెంబర్‌లో ఐటీడీఏ పీవోగా ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. సుమారు 11నెలల పాటు సబ్‌కలెక్టర్‌గా, ఇన్‌చార్జి పీవోగా విధులు నిర్వహించి తనదైన శైలిలో గిరిజన ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. ఈనెల 4న ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏడుగురు సబ్‌కలెక్టర్లను బదిలీ చేసింది. పాతవారి స్థానంలో కొత్తగా ఐఏఎస్‌లను సబ్‌కలెక్టర్లగా నియమిస్తూ జీవో జారీచేసింది. పాలకొండ సబ్‌కలెక్టర్‌గా 2022బ్యాచ్‌కు చెందిన పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌ను నియమించింది. ఆయన ఈనెల 11న పాలకొండ సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. యశ్వంత్‌కుమారొడ్డికి ప్రభుత్వం ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా ప్రభుత్వం హోల్డ్‌లో పెట్టింది. పాలకొండ సబ్‌కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జగన్నాథ్‌కు కూడా సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో బాధ్యతలను అప్పగించలేదు. దీంతో సీతంపేట ఐటీడీఏ పీవోగా ప్రభుత్వం కొత్త వారిని నియమిస్తుందా? లేక యశ్వంత్‌కుమార్‌రెడ్డినే రెగ్యులర్ పీవోగా కొనసాగిస్తుందా? అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

రెగ్యులర్ పీవోల నియామకానికే మొగ్గు?

పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏలకు రెగ్యులర్ పీవోలను నియమించేందుకే ప్రభుత్వం మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. ఏడాదికి పైగా ఇన్‌చార్జిలతోనే నెట్టుకొచ్చిన ఐటీడీఏలకు ఎట్టకేలకు రెగ్యులర్ ఐఏఎస్ అధికారులను నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించనున్న ప్రభుత్వం ఆ దిశగా అడుగులు ముందుకు వేస్తోంది. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐటీడీఏల్లో ఇన్‌చార్జిల పాలనకు స్వస్తిపలికి రెగ్యులర్ పీవోలుగా ఐఏఎస్‌లను నియమించి గిరిజనాభివృద్ధికి బాటలు వేయాలనే ఆలోచనలో ఉంది. అందులో భాగంగానే ఇంతవరకు రెగ్యులర్ పీవోలను నియమించలేదని విశ్వసనీయ వర్గాల సమాచారం. రెగ్యులర్ పీవోల నియామకానికి సంబంధించి మరో రెండు రోజుల్లో ప్రభుత్వం ప్రత్యేక జీవో విడుదల చేయనున్నట్లు బోగట్టా. ఇదే జరిగితే గిరిజన ప్రాంతాలు మరింతగా అభివృద్ధి చెందుతాయని గిరిజన సంఘాల నాయకులు, ఆదివాసీలు విశ్వసిస్తున్నారు.



సీతంపేట ఐటీడీఏ కార్యాలయం


గిరిజన సమస్యలపై అవగాహన..

సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగా సుమారు 11నెలల పాటు పనిచేసిన యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఈ ప్రాంత గిరిజన సమస్యలపై కొంతవరకు అవగాహన పెంచుకున్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే వినతులను పరిష్కరించడంతో పాటు గిరిజన విద్య, మౌలిక సౌకర్యాల కల్పన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిసారించారు. ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు దోమకాట్లకు గురికాకుండా ఉండేందుకు సీఎస్ఆర్ (కార్పొరేటివ్ (మిగతా 8వ పేజీలో..)

ఎటూ తేలలేదు..

పార్వతీపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏలకు కొత్త పీవోలను నియమిస్తారా? లేదా ప్రస్తుతం ఉన్న ఇన్‌చార్జి పీవోలను రెగ్యులర్ పీవోలుగా కొనసాగిస్తారా? అన్న విషయం బుధవారం సాయంత్రానికి ఎటూ తేలలేదు. పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాత్సవ, యశ్వంత్‌కుమార్‌రెడ్డి స్థానంలో కొత్తగా సబ్ కలెక్టర్లను ప్రభుత్వం నియమించింది. వీరిద్దరూ పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏలకు ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారులుగా ఉన్నారు. వీరిద్దరినీ రెగ్యులర్ పీవోలుగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తుందా? లేదా ఇన్‌చార్జి పీవోలుగా కొనసాగిస్తుందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో వీరు ఒకపక్క ఇన్‌చార్జి పీవోలుగా, మరోపక్క సబ్ కలెక్టర్లుగా బాధ్యతలు నిర్వహించడంతో దేనిపై కూడా పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించలేని పరిస్థితి ఉండేది. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

- మహిళలకు కూటమి ప్రభుత్వ వరం
- రేపటి నుంచి అమలుకు సన్నద్ధం
- స్త్రీశక్తి పేరుతో శ్రీకారం
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆర్టీసీ అధికారులు



ఆర్టీసీ బస్సుల్లో ఇక ఉచిత ప్రయాణం

పార్వతీపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి రంగం సిద్ధమైంది. ఇందుకోసం అధికారులు దాదాపు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వం మార్గదర్శకాలు కూడా ఇచ్చింది. ఈ పథకానికి స్త్రీశక్తి పేరును ఖరారు చేసింది. ఈ నెల 15 నుంచి పథకాన్ని అమలు చేయనుంది. మహిళలు ప్రతిరోజు ఎంత మంది ప్రయాణించే అవకాశం ఉందన్న విషయంపై ఇప్పటికే అధికారులు సర్వే చేసుకుని ఓ అంచనాకు వచ్చారు.

జిల్లాలో పరిస్థితి..

మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ఐదు రకాల బస్సులను ప్రభుత్వం ఎంపిక చేసింది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటి ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి మహిళలను అనుమతించనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. జిల్లాలో పార్వతీపురం, పాలకొండ, సాలూరు డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో పల్లె వెలుగు బస్సులు 142 ఉన్నాయి. ఇందులో ఆర్టీసీకి చెందినవి 94 కాగా, ప్రైవేట్ బస్సులు 48 ఉన్నాయి. అల్ట్రా పల్లెవెలుగు బస్సులు 18, ఇందులో నాలుగు ఆర్టీసీవి, 14 ప్రైవేటువి, ఎక్స్ ప్రెస్ సర్వీసులు ఆర్టీసీవి 15, ప్రైవేటువి 12 ఉన్నాయి. ఈ బస్సుల ద్వారా ప్రస్తుతం రోజుకు 68 వేల మంది ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇందులో మహిళలు సుమారు 25 వేల నుంచి 30 వేల మంది ప్రయాణిస్తున్నట్టు అంచనా. వీరందరికీ ఈ నెల 15 నుంచి ఉచిత ప్రయాణం కల్పించనున్నారు. జిల్లా పరిధి దాటి రాష్ట్రంలోని ఎక్కడికైనా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. ప్రయాణ పరిధిని రాష్ట్ర మంతటికీ వర్తింపజేయడంతో సుదూర ప్రాంతాల్లోని బంధువుల ఇళ్లకు, ప్రముఖ దేవాలయాలకు, ఆధ్యాత్మిక కేంద్రాలకు టిక్కెట్ తీయకుండా చేరుకోవచ్చు. ఈ నేపథ్యంలో బస్సులకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది.

అదనపు భారం..

జిల్లాలోని ఆర్టీసీ సర్వీసుల ద్వారా ప్రస్తుతం వస్తున్న ఆదాయం ఇకపై ఆ సంస్థకు తగ్గే అవకాశం ఉంటుంది. మహిళలకు బస్సు ఉచితం కావడమే దీనికి కారణం. ఆర్టీసీకి (మిగతా 8వ పేజీలో..)

గుర్తింపు కార్డు తప్పనిసరి..

ఉచిత బస్సుల్లో ప్రయాణం చేసే మహిళలు తమ గుర్తింపు కార్డులను తప్పనిసరిగా వెంట తీసుకువెళ్లాల్సి ఉంటుంది. ప్రధానంగా వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారై ఉండాలి. ఆధార్ కార్డు గాని, రేషన్ కార్డు గాని, ఓటర్ గుర్తింపు కార్డు గాని తీసుకువెళ్తే సరిపోతుంది. ఉచిత బస్సుల్లో ప్రయాణించే మహిళలకు కండక్టర్ స్త్రీ శక్తి పేరుతో ఉన్న 0 ధర టిక్కెట్‌ను ఇస్తారు. తద్వారా ప్రయాణించే వారి సంఖ్య, దూరం వివరాలను ఆర్టీసీ ప్రతిరోజూ ప్రభుత్వానికి నివేదిస్తుంది. అనంతరం ఆ టిక్కెట్ ధర ప్రభుత్వం నుంచి ఆర్టీసీకి చేరుతుంది. జిల్లాలో విజయనగరంతో పాటు శృంగవరపుకోటలో ఆర్‌టీసీ డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో 60 రూట్లలో బస్సులు నడుస్తున్నాయి. రోజుకు 12 వేల మంది వరకు మహిళలు ప్రయాణిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఉచిత ప్రయాణానికి అవకాశం ఇవ్వడంతో ఆ సంఖ్య సుమారు 25 వేలకు చేరవచ్చని అంచనాకు వచ్చారు.



గరుగుబిల్లి పీహెచ్‌సీలో గర్భిణులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలి

- లేదంటే చర్యలు తప్పవు
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భాస్కరరావు

గరుగుబిల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు రోగులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని, లేదంటే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు హెచ్చరించారు. బుధవారం గరుగుబిల్లి, గొట్టివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీహెచ్‌సీల పరిధిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. 'ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు అధికంగా జరిగేలా అవగాహన కల్పించాలి. ఆరోగ్యశాఖ నిర్దేశించిన ప్రత్యేక యాప్‌లను పూర్తిస్థాయిలో అమలు పర్చాలి. యాప్‌లకు సంబంధించి సిబ్బంది తగిన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. వైద్య సేవలు, తల్లిపాలు ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. ఈ-ఆశా యాప్‌లో ఆరోగ్య వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలి.' అని అన్నారు. పీఎంజేవై, పీఎంఏవై, ఎన్‌సీడీసీడీ, ఎనిమియా యాక్షన్, తదితర పలు విషయాలపై చర్చించారు. గొట్టివలసలో నిర్వహించిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌బీఎస్‌కే కార్యాలయ అధికారి డాక్టర్ తెర్లి జగన్మోహన్‌రావు, డాక్టర్ ఎస్‌ఎంకే తిరుమలప్రసాద్, వైద్య సిబ్బంది జగదీశ్వరి, ఉదయకుమారి, డి.మృత్యుంజయరావు, పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'ఆదికర్మయోగి'తో గిరిజన ప్రాంతాల్లో మార్పు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆదికర్మయోగి కార్యక్రమం ద్వారా గిరిజన ప్రాంతాల్లో మార్పు తేవడానికి శ్రీకారం చుడుతున్నామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఆదికర్మయోగి బ్లాక్ స్థాయి శిక్షకుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఆదికర్మయోగి కార్యక్రమ వివరాలను వెల్లడించారు. 'మొదటి దశలో ఆరు మండలాలకు సంబంధించి శిక్షకులు వై.శంకరరావు, పీఎంకెరెడ్డి, డాక్టర్ రమణకుమార్, సోమేశ్వరరావు, చంద్రబాబు, చంద్రమౌళి, రాజశ్రీలకు శిక్షణ అందించాం. సామాజిక భాగస్వామ్యం, అవగాహనతో గ్రామాల్లో అవసరాలను గుర్తిస్తాం. గ్రామస్థాయి అభివృద్ధి ప్రణాళికలను తయారు చేస్తాం. ఇందుకు ఆన్‌లైన్ టూల్‌ను తయారు చేస్తాం. పలువురు స్వచ్ఛంద కార్యకర్తల భాగస్వామ్యంతో గ్రామాల్లో పనులు చేపడతాం.' అని కలెక్టర్ అన్నారు. పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ మాట్లాడుతూ.. ఆది కర్మయోగి కార్యక్రమం ద్వారా గ్రామాల్లో మనది అనే సొంత భావన ప్రజల్లో ఏర్పడుతుందని అన్నారు. అనంతరం శిక్షణ పొందిన కర్మయోగిలకు ధ్రువ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గిరిజన మంత్రిత్వశాఖ పీఎం జన్మన్ ప్రాజెక్టు అధికారి రిషబ్ చతుర్వేది, ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎ.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



ర్యాలీలో పాల్గొన్న ట్రాక్టర్లు



ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

రైతు పక్షపాతి సీఎం చంద్రబాబు

- ఎమ్మెల్యే విజయచంద్ర
- పార్వతీపురంలో ట్రాక్టర్లతో ర్యాలీ

పార్వతీపురం/రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రైతు పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో బుధవారం పార్వతీపురంలో ఎమ్మెల్యే విజయచంద్ర ఆధ్వర్యంలో రైతులు సుమారు 120 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. నర్సిపురం గ్రామం నుంచి ఏఎంసీ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవ విజయోత్సవ కార్యక్రమానికి విశేష స్పందన రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రైతు బాగుంటే దేశం బాగుంటుందన్నారు. రైతుల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు రూ.20వేలు ఆర్థిక సాయం అందిస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ర్యాలీ ప్రారంభానికి ముందు నర్సిపురంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళులు అర్పించారు. రైతులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పంటల బీమా.. అన్నదాతలకు ధీమా

- సాగుకు ముందే పంట నమోదుకు అవకాశం
- ఈ-పంట డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌నకు రూపకల్పన
- ఈ-క్రాప్ నిబంధనల్లో మార్పు 6లో

పొట్టకూటి కోసం వచ్చి..

ఎక్స్‌కవేటర్ మీద పడడంతో ట్రాలీ డ్రైవర్ దుర్మరణం 7లో

పార్వతీపురంలో సినీఫక్కీలో చోరీ

7లో

పాలకొండను జిల్లాగా చేయండి

- లేదా శ్రీకాకుళంలో కలపండి
- జిల్లా సాధన సమితి వినతి

పాలకొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజనకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం తొలి సమావేశం విజయవాడలోని రాష్ట్ర సచివాలయంలో బుధవారం జరిగింది. ఈ సమావేశానికి పాలకొండ జిల్లా సాధన సమితి గౌరవాధ్యక్షుడు కనపాక చౌదరినాయుడు, సాధన సమితి జిల్లా ట్రెజరర్ సబ్బ నానాజీతో కూడిన బృందం హాజరై తమ సమస్యలను మంత్రివర్గ ఉపసంఘానికి తెలియజేసింది. పాలకొండ రెవెన్యూ డివిజన్‌ను కొత్త జిల్లా అయినా చేయాలి.. లేదా శ్రీకాకుళం జిల్లాలో అయినా కలపాలని విన్నవించింది. ఈ నెల 29, 30 తేదీల్లో తాము జిల్లా కేంద్రాలకు వచ్చి ప్రజల అభిప్రాయాలు సేకరిస్తామని, తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని, మీ అభిప్రాయాలను కూడా నివేదికలో పొందుపరుస్తామని మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు.. పాలకొండ జిల్లా సాధన సమితి సభ్యులకు హామీనిచ్చారు. గతంలో జిల్లాల విభజన సమయంలో జరిగిన అన్యాయాన్ని స్థానిక ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని, పాలకొండలో అన్ని వర్గాలతో రాజకీయాలకు అతీతంగా సమావేశం ఏర్పాటు చేసి, మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకొని వెళతామని పాలకొండ జిల్లా సాధన సమితి అధ్యక్ష కార్యదర్శులు బుడితి అప్పలనాయుడు, వండాన కూర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు.



మంత్రివర్గ ఉపసంఘం తొలి సమావేశం జరుగుతున్న దృశ్యం

అదనపు భారం తగ్గించుకుందాం



- విద్యుత్ ఓవర్‌లోడ్ రెగ్యులరైజేషన్‌కు మరో అవకాశం
- 50 శాతం సబ్సిడీ ప్రకటించిన ప్రభుత్వం
- డిసెంబరు 31 వరకూ గడువు

రాజాం రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి)

గృహావసరాలకు సంబంధించిన వినియోగదారులకు విద్యుత్ ఓవర్‌లోడ్‌ను 50 శాతం సబ్సిడీతో రెగ్యులరైజ్ చేసుకునేందుకు ఏపీఈపీడీసీఎల్ మరో అవకాశం కల్పించింది. మార్చి నుంచి జూన్ 30 వరకు తొలిదశలో రాయితీతో రెగ్యులరైజేషన్ చేసుకునేలా వెసులుబాటు కల్పించింది. అయితే వినియోగదారుల సౌలభ్యం కోసం మరోసారి గడువు పెంచింది. ఈ ఏడాది డిసెంబరు 31 వరకు ఓవర్‌లోడ్‌ను రెగ్యులర్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

ఓవర్‌లోడ్ అంటే..

రోజురోజుకూ విద్యుత్ వినియోగం పెరిగిపోతోంది. మిక్సీలు, గ్రైండర్లు, ఏసీలు, ఇతరత్రా విద్యుత్ పరికరాల వినియోగం అధికమవుతున్న నేపథ్యంలో ఈ పరిస్థితి నెలకొంది. అవసరానికి మించి లైట్లు, ఫ్యాన్లు, ఏసీలు వాడడం.. గ్రీజర్లు, ఐరన్‌బాక్స్‌లు ఉపయోగించడం వల్ల ఓవర్‌లోడ్ పడుతోంది. దీంతో బిల్లుల మోత ఎక్కువవుతోంది. వివిధ అభివృద్ధి చార్జీల పేరిట వినియోగదారులపై అదనపు భారం పడుతోంది. అయితే చాలామంది వినియోగదారులకు దీనిపై అంతగా అవగాహన లేదు. దీనినుంచి ఉపశమనం పొందడానికి అదనపు లోడును క్రమబద్ధీకరణ చేసుకోవడం ఒకటే మార్గమని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం మరో ఐదు నెలలపాటు అవకాశం కల్పించిన నేపథ్యంలో గృహ విద్యుత్ వినియోగదారులంతా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

రాయితీ చార్జీలు ఇలా..

కిలోవాట్	సాధారణ చార్జీలు	రాయితీతో చెల్లించాల్సింది
1	2250	1250
2	4450	2450
3	6650	3650
4	8850	4850
5	11050	6050

పెరుగుతున్న వినియోగం..

జిల్లాలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. ఈ క్రమంలో ఓవర్‌లోడ్‌ను క్రమబద్ధీకరణ చేసుకోకుండా వాడుతున్న వారిని ట్రాన్స్‌కో అధికారులు గుర్తించి జరిమానాలు కూడా విధిస్తున్నారు. వాస్తవానికి చాలామంది వినియోగదారులకు విద్యుత్ కనెక్షన్ లోడ్ ఎంతో తెలియదు. మీటర్ కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో నమోదు చేసిన లోడ్ కన్నా ఎక్కువగా వాడుతున్నారు. దీంతో ఇళ్లలో ఓల్టేజి రావడం, విద్యుత్ సమస్యలు ఏర్పడం వంటివి చోటుచేసుకుంటున్నాయి.

సచ్ఛందంగా ముందుకు రావాలి..

వినియోగదారులు స్వచ్ఛందంగా ఓవర్‌లోడ్‌ను రెగ్యులరైజ్ చేసుకునేందుకు ముందుకు రావాలి. ఈమేరకు 50 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబరు 31 వరకూ గడువు పెంచింది. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. మరిన్ని వివరాల కోసం మీపరిధిలోని ట్రాన్స్‌కో అధికారులను సంప్రదించాలి.

-సురేష్‌బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఏపీఈపీడీసీఎల్, విజయనగరం రూరల్ డివిజన్



గడిగెడ్డ నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు

వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే కళావెంకటరావు

గుర్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి తెలుగుదేశం ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చీపురుపల్లి ఎమ్మెల్యే కళావెంకటరావు అన్నారు. బుధవారం పకీరుకితలి వద్ద ఉన్న గడిగెడ్డ రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేశారు. గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి... నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈసారి వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ నీటిని సద్వినియోగం చేసుకొని పంటలు పండించుకోవాలన్నారు. సాగు నీటి కాలువల బాగు చేయనున్నట్టు తెలిపారు. తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు సీహెచ్ మహేశ్వరరావు, డాక్టర్ సుంకరి రమణమూర్తి, గడిగెడ్డ రిజర్వాయర్ అధ్యక్షులు సన్యాసినాయుడు, ఉపాధ్యక్షుడు రమేష్, ఆత్మ మాజీ చైర్మన్ కె.కృష్ణ, తహసీల్దార్ ఆదిలక్ష్మి, నారాయణమ్మ, ఈఈ నారాయణ, డీఈ గోవిందరావు, జేఈ సంతోష్‌కుమార్, అప్పలనాయుడు, శివప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవినాయుడు

క్రీడాహబ్‌గా విజయనగరం

- రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ రవినాయుడు

విజయనగరం రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విజయనగరాన్ని క్రీడాహబ్‌గా మార్చేందుకు కృషి చేయనున్నట్టు రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ రవినాయుడు చెప్పారు. క్రీడా మైదానాలు, క్రీడావసతులు పరిశీలించేందుకు బుధవారం విజయనగరం వచ్చిన ఆయన స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకూ క్రీడా రంగాన్ని సర్వనాశనం చేశారన్నారు. 2014 నుంచి 2019 వరకూ క్రీడారంగానికి, మౌలిక వసతుల కల్పన కోసం టీడీపీ ప్రభుత్వం విడుదల చేసిన నిధులు, పనులను మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి నిలిపివేశారన్నారు. విజ్జీ, రాజీవ్ క్రీడా మైదానం, ఇండోర్ స్టేడియంలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. విజ్జీ స్టేడియంలో స్పోర్ట్సు స్కూల్‌ని పునఃప్రారంభించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డాక్టర్ కె.శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆయన జిల్లా క్రికెట్ అసోసియేషన్ సమావేశంలో పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద, బలహీన వర్గాల పిల్లలకు విద్యా హక్కు చట్టం కింద కేటాయించిన 20 శాతం సీట్లలో మిగిలిన వాటి భర్తీ కోసం అదనపు నోటిఫికేషన్ ఇచ్చినట్టు డీఈవో మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఏపీసీ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఐదు కిలోమీటర్లు లోపు ఉన్న ప్రైవేటు, అన్ఎయిడెడ్ పాఠశాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యా లక్ష్యాలపై వర్క్‌షాపు..

వికసిత్ భారత్-2047లో భాగంగా విద్యా లక్ష్యాలపై బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఒక్క రోజు వర్క్ షాపు నిర్వహించారు. వనరులు, సమస్యలు, పరిష్కార మార్గాలు, ప్రణాళికల అమలుపై చర్చించారు. ఈ వర్క్ షాపులో డీఈవో మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష పీపీసీ రామారావు, డైట్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, డిప్యూటీ డీఈవో రమణ తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా.. అన్నదాతకు ధీమా



అగ్రహారం సమీపంలో వరినాట్లు వేస్తున్న దృశ్యం (ఫైల్)

- సాగుకు ముందే పంట నమోదుకు అవకాశం
- ఈ-పంట డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌నకు రూపకల్పన
- ఈ-క్రాప్ నిబంధనల్లో మార్పు

రాజాం రూరల్/ గజపతినగరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమిస్తున్న అన్నదాతకు అండగా ఉండేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. వారికి ఆర్థికంగా ప్రోత్సాహం ఇచ్చేలా పథకాలు రూపొందించి అమలు చేస్తోంది. ఇప్పటికే అన్నదాతా సుఖీభవ నిధులు రైతన్న ఖాతాల్లో జమ అయ్యాయి. అలాగే ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలు, ఇతరత్రా కారణాలతో పంట నష్టపోతే పంటబీమా వర్తించేందుకు వీలుగా ప్రణాళికలు సిద్ధం చేసింది. గతానికి భిన్నంగా పంట వేయకుండానే అవసరమైన పత్రాలతో బీమా చేసుకునే అవకాశం ఇచ్చింది. పంట సాగు చేశాక ఆ వివరాలను ఈ పంటలో నమోదు చేస్తే సరిపోయేలా వెసులుబాటు కల్పించింది. అయితే బీమా చేశాక తప్పకుండా పంట సాగు చేయాల్సిన అవసరం ఉంది. గతంలో పంటవేసి, ఈ పంట నమోదు చేసిన తర్వాత బీమా చెల్లించాల్సి వచ్చేది. దీంతో పంట సాగు చేసే లోపు బీమా చెల్లించేందుకు గడువు ముగిసిపోవడం, పంట నాశనం అయినా బీమా క్లెయిమ్ రాక నష్టపోయే పరిస్థితులు ఉండేవి. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం అన్నదాతను ఆదుకోవాలనే లక్ష్యంతో పంట వేయకముందే బీమా చేయించుకునేందుకు అవకాశం కల్పించింది.ఈ-క్రాప్ నిబంధనలలో మార్పు తీసుకువచ్చారు. వ్యవసాయ పంటల నమోదుకు ఏవో, ఉద్యాన పంటలకు ఉద్యానవన శాఖాధికారి, ప్రభుత్వ, వ్యవసాయేతర భూములకు తహసీల్దార్‌కు బాధ్యతలు అప్పగించారు.

యూడీపీ రద్దు..

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో రూపొందించిన యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్‌ఫారం (యూడీపీ)ను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ) ద్వారా 'ఈ పంట డిజిటల్ క్రాప్ సర్వే' పేరుతో కొత్త యాప్‌ను రూపొందించారు. ఈ ఖరీఫ్ నుంచి సాగు చేయని భూముల వివరాలు కూడా నమోదు చేస్తున్నారు. దీనివల్ల ఎంత విస్తీర్ణంలో సాగు నిలిచిపోయిందనే విషయం స్పష్టమవుతుంది. తద్వారా రైతులు భూమిని ఎందుకు సాగు చేయలేదో ప్రభుత్వం ఓ అంచనాకి వచ్చి భవిష్యత్తులో వారికి ఏవిధంగా చేయూతను అందించాలో నిర్ణయం తీసుకునేందుకు వీలుంటుంది. ఈ ఏడాది నుంచి వరితో పాటు ఉద్యానవన పంటలను నమోదు చేస్తారు. సచివాలయాలు, కామన్ సర్వీస్ సెంటర్లలో రైతులు బీమా ప్రీమియం చెల్లించవచ్చును. ఇందుకోసం అవసరమైన పత్రాలను ఇవ్వాల్సి ఉంటుంది. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న రైతులు బీమా ప్రీమియంను బ్యాంకుల్లోనే చెల్లించాలి.

ఇవీ మార్గదర్శకాలు..

- వెబ్‌ల్యాండ్ ఆధారంగా పంట నమోదు జరుగుతుంది. ప్రభుత్వ భూమి, అభ్యంతరకర సర్వే నెంబర్లు, ఖాతా నెంబర్లను వ్యవసాయేతర భూమిగా నమోదు చేస్తారు.
- ఎకరా కంటే తక్కువ భూమి ఉంటే జియో ట్యాగ్ చేసి ఫొటో తప్పనిసరిగా తీయాలి. పొలంలో పంట ఉన్నా, లేకపోయినా ప్రతి ఎకరా ఫోటో తీయాల్సిందే.
- వ్యవసాయశాఖ సిబ్బంది క్షేత్ర స్థాయికి వెళ్లి మ్యాపింగ్ చేయాలి. వారి ఫోన్లకు మ్యాప్ చేసుకుంటేనే యాప్ పనిచేస్తుంది.
- గతంలో క్షేత్రస్థాయికి వెళ్లకుండానే పంట నమోదు జరిగేది. ప్రస్తుతం ఈ ఆప్షన్ రద్దు చేశారు. ప్రస్తుతం జియో ఫెన్సింగ్ ఫీల్డ్ సర్వే చేసి ఫొటో తీయాలి.
- గతంలో 200 మీటర్ల వరకూ జియో కోఆర్డినేట్స్‌కు అనుమతి ఉండేది. ప్రస్తుతం 20 మీటర్లలో జియో ఫెన్సింగ్ ఫొటో తీయాల్సి ఉంటుంది.

ఫసల్ బీమా నమోదుకు 15తో ముగియనున్న గడువు..

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకు సంబంధించి ప్రీమియం చెల్లించేందుకు వరి పంటకు ఆగస్టు 15 వరకు మాత్రమే గడువు ఉంది. ఈ బీమాతో ఖరీఫ్‌లో వరి, పత్తి పంటలు పండించే రైతులు వరి పంటకు సంబంధించి ఎకరాకి రైతు వాటాగా రూ.200 చెల్లించాలి. వరి పంటకు నష్టం వస్తే ఎకరానికి రూ.40 వేల వరకు బీమా పొందే అవకాశం ఉంది. అలాగే పత్తి పంటకు సంబంధించి రైతు వాటాగా రూ.1923 చెల్లించాల్సి ఉండగా రూ.45వేల వరకు బీమా పొందవచ్చు. అలాగే మొక్కజొన్న సాగుకు రూ.165 వేలు బీమా కడితే పరిహారం రూ.33వేలు, నువ్వుల పంటకు రూ.65 చెల్లిస్తే పరిహారం రూ.13వేలు వరకు వస్తుంది.

ఇదీ షెడ్యూల్..

- పంట నమోదుకు గడువు: సెప్టెంబరు 15
- గ్రామసభల నిర్వహణ: సెప్టెంబరు 19-24 మధ్య
- ఫిర్యాదుల స్వీకరణ: సెప్టెంబరు 25 నుంచి 28
- తుది జాబితా ప్రచురణ: సెప్టెంబరు 30

పంట వేయకపోయినా బీమా..

పంట వేయకపోయినా బీమా చేయించుకోవచ్చు. అయితే పంట సాగు చేస్తారనే ధ్రువపత్రాన్ని రైతులు ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి తీసుకుని పొందుపరచాలి. వరి నాట్లు వేశాక ఈ పంట నమోదు తప్పనిసరి. ఈ-పంట డిజిటల్ క్రాప్ సర్వేపై సిబ్బందికి అవగాహన కల్పించాం. క్షేత్ర స్థాయిలో అన్నిరకాల భూములను నమోదు చేయాల్సిందే. పంట వేసినా, వేయకపోయినా నమోదు చేస్తాం.

- వీటీ రామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

రైతులు సద్వినియోగం చేసుకోండి..

ఫసల్ బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు కలిగి ఉండి వీఆర్వో లాగిన్‌లో పంటను ఈక్రాప్ నమోదు చేసుకుని మీసేవలో రైతు పేరున బీమా నమోదు చేసుకోవాలి. అలాగే రైతులు రూ.200 చెల్లించి ఈ పథకం కిందకు రావాలి.

-నిర్మలాజ్యోతి, ఏడిఏ, గజపతినగరం





ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు, డీసీసీబీ చైర్మన్ నాగార్జున, ఎమ్మెల్యే లలితకుమారి

రైతన్న అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

భోగాపురం, డెంకాడ (పూసపాటిరేగ), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రైతన్నల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయడంతో పూసపాటిరేగ సమీపంలో బుధవారం నిర్వహించిన రైతు సంబరాల కార్యక్రమం లో ఆయన మాట్లాడారు. ముందుగా ఎమ్మెల్యే లోకం నాగమాధవి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున నాతవలస టోల్‌గేట్ వద్ద ట్రాక్టర్ ర్యాలీ ప్రారంభించా రు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బంగార్రాజు మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం రాకతో రైతులకు పూర్వ వైభవం వచ్చినట్లు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, భోగాపురం మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిన్నంనాయుడు, విశాఖ నార్త్ పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, మహంతి శంకరరావు, గేదెల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

వేపాడలో..

వేపాడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): లక్కవరపుకోట మండలంలోని గోల్డ్‌స్టార్ జంక్షన్ నుంచి ఎస్.కోట దేవీ గుడి వరకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రైతులు ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. వేపాడ మండలంలోని పాటూరు, బొద్దాం గ్రామాల మీదుగా ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, లక్కవరపుకోట, కొత్తవలస, వేపాడ మండలాల టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



గజపతినగరంలో ట్రాక్టర్ల ర్యాలీ

సాగులో టెక్నాలజీని ఉపయోగించండి

- సబ్సిడీపై డ్రోన్‌లు, ఇతర పరికరాలను అందిపుచ్చుకోండి
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం/బొండపల్లి, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పద్ధతిలో వ్యవసాయం చేయాలని, అందుకు అవసరమైన డ్రోన్, ఇతర పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీలో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్ కాలనీ నుంచి జాతీయ రహదారి మీదుగా వ్యవసాయ మార్కెట్ వరకు ట్రాక్టర్లతో ర్యాలీ చేపట్టారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ట్రాక్టర్‌ను నడుపుతూ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రైతు రాజుగా ఎదగాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని, ప్రభుత్వం ఆధునిక సాగు యంత్రాలపై అందిస్తున్న సబ్సిడీని ఉపయోగించుకోవాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 అందజేస్తామని, మొదటివిడతగా రూ.7వేలు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రెండో విడతలో మరో రూ.7వేలు, మూడో విడతగా రూ.6వేలు అందజేస్తామన్నారు. ఐదేళ్ల పాలనలో జగన్ వ్యవసాయరంగంతో పాటు సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాదిలోనే అనేక రైతు అనుకూల నిర్ణయాలు తీసుకుందన్నారు. ఆంధ్ర, తాటిపూడి రిజర్వాయర్ పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని, యూరియా అధికంగా వాడవద్దని, ఎంత అవసరమైతే అంతే వాడాలని సూచించారు. ఏటా మూడు పంటలు పండించుకొనేందుకు రైతులకు అవసరమైన సహాయ, సహకారాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు కొండపల్లి కొండలరావు, ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, జనసేన పీఏసీ సభ్యురాలు మాజీమంత్రి పడాల అరుణ, బీజేపీ రాష్ట్ర నాయకురాలు రెడ్డి పావని, పీఏసీఎస్ చైర్మన్ లెంక బంగారునాయుడు, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లిలోనూ ర్యాలీ..

అన్నదాత సుఖీభవ పథకంతో లబ్ధిపొందిన రైతులతో బుధవారం బొండపల్లిలో చేపట్టిన ట్రాక్టర్ ర్యాలీలో మంత్రి శ్రీనివాస్ పాల్గొన్నారు. కొద్దిసేపు ట్రాక్టర్ నడిపారు. బొండపల్లి, గంట్యాడ, జామి మండలాలకు చెందిన సుమారు 350 ట్రాక్టర్లతో ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో పార్టీ నాయకులు అల్లు విజయ్‌కుమార్, రొంగళి అర్జునరావు, బొండపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు రాపాక అచ్చింనాయుడు, బుద్ధరాజు బుచ్చిరాజు, గొట్లాం పీఏసీఎస్ అధ్యక్షుడు సిగడాం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బొండపల్లి: ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

న్యూస్ బాక్స్

20న స్థాయీ సంఘ సమావేశాలు

విజయనగరం టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20వ తేదీన జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్టు సీఈవో బి.వి.సత్యనారాయణ తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో సమావేశాలు జరుగుతాయని తెలిపారు.

అనధికార ప్రకటనలను అనుమతించం

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో అనధికార ప్రకటనలు, ప్రచారాన్ని అనుమతించేది లేదని నగర పాలక సంస్థ కమిషనర్ పి .నల్లనయ్య స్పష్టం చేశారు. బుధవారం నగరంలోని ఓ నగల దుకాణం అనుమతి తీసుకోకుండా చేపడుతున్న ప్రచార వాహనాన్ని ప్రణాళికా సిబ్బంది అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నల్లనయ్య మాట్లాడుతూ ఇకపై ఇలా చేస్తే వాహనాలను, బోర్డులను స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రైవ్

విజయనగరం క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతలో భాగంగా జిల్లా వ్యాప్తంగా బ్లాక్‌స్పాట్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 4 నుంచి 10 వరకూ చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనం నడిపిన 298 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. కొంతమందికి కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరూ భద్రతా ప్రమాణాలు పాటిస్తూ, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. స్పెషల్ డ్రైవ్‌లో డీఎస్పీలు శ్రీనివాసరావు, భవ్యరెడ్డి, రాఘవులు పాల్గొన్నారని ఎస్పీ తెలిపారు.

16 నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16 నుంచి 20 వరకూ నగరంలోని గురజాడ కళాభారతిలో ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్టు సంస్థ అధ్యక్షుడు బి .శంకరరావు తెలిపారు. బుధవారం గురజాడ కళాభారతి కార్యాలయంలో ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంతో పాటు నెల్లిమర్ల, గజపతినగరం, రాజాం, బొద్దాం, బొబ్బిలి ప్రాంతాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు నాయుడు, రామకృష్ణ, సూరిబాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వేషధారణ పోటీలు

చీపురుపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని ఈ నెల 16న బ్రహ్మకుమారీల కేంద్రంలో శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించనున్నట్టు కేంద్రం ఇన్‌చార్జి బీకే శాంతి తెలిపారు. వివరాలకు 83099 74599 నంబరులో సంప్రదించాలన్నారు.

ఎంపీడీవోగా రవికుమార్

గుర్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవోగా పి.రవికుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల సమస్యలను అవగాహన చేసుకొని ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని చెప్పారు.

సీపీఐ పోస్టర్ ఆవిష్కరణ

నెల్లిమర్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23 నుంచి ఒంగోలులో జరిగే సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం కొండకెంగువ గ్రామంలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బొగత అశోక్ మాట్లాడుతూ ఈ మహాసభల్లో ఆర్థిక రాజకీయ, సామాజిక అంశాలపై సమరశీల పోరాటాలకు సమాయత్తం కానున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముయ్యద పాపారావు, బాలి గౌరునాయుడు, పోలిపల్లి సూరి, చవిటి నాయుడు, ఎడ్ల పైడినాయుడు పాల్గొన్నారు.

2,500 రోజులుగా అన్నదానం

చీపురుపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాజాం మండలంలోని వావిలవలసలో గత 2,500 రోజులుగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని నిర్వాహకుడు పాలూరి సిద్ధార్థ తెలిపారు. ఆయన బుధవారం చీపురుపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి చీపురుపల్లి ఎస్ఐ ఎల్. దామోదరరావు బియ్యం, నూనె అందజేశారని తెలిపారు.

21 నుంచి భవానీ దీక్షలు

రాజాం రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక నవదుర్గ అమ్మవారి దేవస్థానంలో ఈనెల 21 నుంచి భవానీ మాత మండల దీక్షలు ప్రారంభం కానున్నాయని ధర్మకర్త నర్సింగరావు, ఈఓ శ్యామలరావు తెలిపారు. అక్టోబర్ 2న అమ్మవారి నిజరూప దర్శనం కల్పిస్తామన్నారు.

ఇన్నాళ్లకు కరుణించిన వర్షం



భోగాపురం: వర్షపునీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు



సంతకవిటిలో కురుస్తున్న వర్షం

భోగాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రైతుల ఎదురుచూపులు ఫలించాయి. చాలా రోజుల తరువాత వర్షం కురిసింది. జిల్లాలో తీర ప్రాంత మండలాలైన భోగాపురం, పూసపాటిరేగ ప్రాంతాల్లో బుధవారం కురిసిన వర్షంతో రైతన్నల్లో సంతోషాన్ని నింపింది. రెండు మండలాల్లో సరైన వర్షాలు లేకపోవడంతో అన్నదాతలు దిగులు పడుతున్నారు. తాజాగా కురిసిన వర్షంతో వీరంతా ఊపిరి పీల్చుకున్నారు. జాతీయ రహదారిపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో వాహన చోదకులు అవస్థలు పడ్డారు.



రాజాం - డోలపేట మధ్యలో రోడ్డుపై నిలిచిపోయిన నీరు

సంతకవిటిలో...

సంతకవిటి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. రెండు వారాలుగా మేఘాల వైపు చూస్తున్న రైతులు ఈ వర్షంతో ఊరట చెందారు. వరి, మొక్కజొన్నకు ఈ వర్షం మేలు చేస్తుందని వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వర్షం తెచ్చిన కష్టాలు..

రాజాం రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాజాం పరిసర ప్రాంతాల ప్రజలకు ఏమాత్రం వర్షం వచ్చినా కష్టాలు తప్పడం లేదు. చిన్నపాటి వర్షానికే వీధులు, రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. బుధవారం ఇదే పరిస్థితి ఎదురైంది. రాజాం- డోలపేట మధ్య విస్తరణ పనులు నిలిచిపోవడంతో ఏమాత్రం వర్షం కురిసినా నీరంతా రోడ్డుపైనే నిలిచిపోతోంది. ద్విచక్ర వాహన చోదకుల వెతలు వర్ణనాతీతం. ఈశ్వర నారాయణ కాలనీ, బాబానగర్ కాలనీలలోకి వెళ్లేందుకు కూడా అవకాశం లేని పరిస్థితి ఉంటోంది. మంగళవీధి, మల్లికార్జున కాలనీలోని రెండు లైన్లలో మురుగునీరు ఇళ్లల్లో చేరుతోంది. ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి నడచి వెళ్లేందుకు కూడా వీల్లేని విధంగా నీరు నిలిచిపోతోంది. రాజాం-శ్రీకాకుళం రోడ్డులోని సప్తగిరికాలనీ వద్ద రహదారి గోతులమయంగా మారింది. పట్టణంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో తరచూ ఇలాంటి పరిస్థితులు నెలకొంటున్నాయి.

తూకాల్లో తేడాలు ఉండకూడదు



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బేకరీ, స్వీట్స్ దుకాణాలు తూకాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని... అట్టపెట్టెల బరువును మినహాయించి నికర బరువును మాత్రమే చూపించాలని, ఎలక్ట్రానిక్ కాటాల్లో తూకం మొదలు పెట్టేముందు జీరో రీడింగ్ తప్పనిసరిగా ఉండాలని లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ బి.మనోహర్ అన్నారు. బుధవారం తోటపాలెం వద్ద లీగల్ మెట్రాలజీ కార్యాలయంలో బేకరీ, స్వీట్స్ షాపు యాజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలతల విషయాల్లో కచ్చితంగా నియమాలు పాటించాలన్నారు. ప్యాకేజీ ఆహార పదార్థాలపై లేబుల్, ముద్రణ వంటి వివరాలు స్పష్టంగా ఉండాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ రంగారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు ఉమాసుందరి, సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ స్పందించి న్యాయం చేయాలి



నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): 'ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ గారూ... జిందాల్ నిర్వాసిత గ్రామాలకు రండి. మా శాంతియుత దీక్షను చూసి న్యాయం చేయండ'ని బొడ్డవర గ్రామం వద్ద బుధవారం జిందాల్ నిర్వాసితులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరస్వతి పవర్స్ పరిశ్రమ ఏర్పాటు చేయకపోతే అక్కడి నిర్వాసితులకు భూములను అప్పగించారు. జిందాల్ బాధితులకు అదే తరహా న్యాయం చేయాలని కోరారు. గడిచిన 53రోజులుగా దీక్షలు చేస్తున్న తమకు ఎటువంటి న్యాయం దొరకలేదని.. మీరైనా స్పందించి న్యాయం చేయాలని పవన్‌ను ఉద్దేశించి నినాదాలు చేశారు.

సంక్షేమ పథకాల అమలుపై అధికారుల నిలదీత



అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

నెల్లిమర్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలైన అన్నదాత సుఖీభవ, తల్లికివందనం, రీసర్వే సమస్యలపై మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అధికారులను నిలదీశారు. బుధవారం ఎంపీపీ అంబళ్ల సుధారాణి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్ బాబులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బొప్పడాం, టెక్కలి, పారసాం సర్పంచ్‌లు, బొంతు కిరణ్, నేతేటి స్వామినాయుడు, గొలజాన నారాయణరావు, ఎంపీటీసీ సంగం రెడ్డి జగన్నాథం మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం ం కొంతమందికి పడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకం అందలేదని తెలిపారు. రీసర్వే వల్ల డబుల్ ఎంట్రీలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా యంత్రాంగం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే లోకంనాగమాధవి మాట్లాడుతూ సభ్యులు తీసుకువచ్చిన సమస్యలు పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, తహసీల్దార్ కె.శ్రీకాంత్, ఎంపీడీవో పి.సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో జట్టుకు విద్యార్థినుల ఎంపిక

గజపతినగరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గంగచోళ్లపెంట గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థినులు జిల్లా ఖోఖో జట్టుకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.బంగార్రాజు మంగళవారం తెలిపారు. ఈ నెల20, 21న విశాఖపట్నంలో జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. ఈమేరకు క్రీడాకారిణులు టి.పూర్ణిమ, ఎ.గౌరి, జె.దీక్షితలను ఉపాధ్యాయులు సత్యనారాయణ తదితరులు అభినందించారు.

ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలి

రాజాం రూరల్, ఆగష్టు 13 (ఆంధ్రజ్యోతి): దేశ సంపదను, దేశాన్ని విదేశాలకు తాకట్టు పెట్టే ప్రధానమంత్రి మోదీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా పోరాటాలకు సిద్ధం కావాలని సిటు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శంకరరావు, సురేష్ పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని ఆరోపిస్తూ రాజాంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా తరగతుల నిర్వహణ

చీపురుపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతులు లేకుండా ప్రాథమికోన్నత తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం వారు సంబంధిత పాఠశాల గేటు ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాని, జగదీష్, మధులత పాల్గొన్నారు.

తుపాకులు వినియోగించడం నేరం

కొత్తవలస, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి లైసెన్సులు లేకుండా నాటు తుపాకులను వినియోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. బుధవారం ఆయన కొత్తవలసలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో లైసెన్సులు కలిగిన తుపాకులు ఎన్ని ఉన్నాయనే విషయమై పోలీసు స్టేషన్ల వారీగా తనిఖీలు చేయనున్నట్టు తెలిపారు. తుపాకులకు సంబంధించిన బుల్లెట్ల వివరాలు కూడా లెక్క చెప్పాలన్నారు. గ్రామాలలో ఎవరైనా నాటు తుపాకులు తయారు చేసి విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎయిర్ గన్‌లు బహిరంగ ప్రదేశాలలో వాడినా చర్యలు తప్పవన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తవలస, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే దిశగా పని చేయలేదని కొత్తవలస, శృంగవరపుకోట తాలూకా ఎన్జీఓ సంఘం అధ్యక్షులు జేవీ ప్రసాదరావు, నారాయణరావు అన్నారు. బుధవారం కొత్తవలస ఎన్జీవో సంఘం భవనంలో రెండు తాలూకా సంఘాల పరిధిలో గల ప్రభుత్వ ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కుమార్, కళావతి, భాగ్యవతి, సూర్యారావు, గణేశ్వరరావు, రమేష్, సునీల్, కృష్ణారావు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలు

ఎస్.కోట రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తకాలు చదివి... కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన ఐదుగురు యువకులకు లైబ్రేరియన్ శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. కానిస్టేబుళ్లుగా ఎంపికైన వసంత గణేష్, నౌదసరి సన్యాసిరావు, వంతల ప్రవీణ్ కుమార్, పాతబోయిన శివాజీ, లెక్కల గణేష్‌లను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, ఎంపీటీసీ మజ్జి దేవి, మాజీ ఎంపీటీసీ మోపాడ శ్రీను పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

చీపురుపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆర్డీఓ బి.ఆశయ్య హితవు పలికారు. స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో బుధవారం మాదక ద్రవ్యాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.రమేష్‌కుమార్, అధ్యాపకులు కె.జ్వాలాముఖి, బి.విజయేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై కార్యదర్శులు దృష్టి పెట్టండి



కొత్తవలస: స్థానికులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో



భోగాపురం: పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీపీవో



చీపురుపల్లి: కుళాయి నీటిని పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ

కొత్తవలస, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పారిశుధ్య పనులు చేయించడంపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి పెట్టాలని జిల్లా పరిషత్ సీఈఓ బి.వి. సత్యనారాయణ అన్నారు. బుధవారం అప్పన్నపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. గ్రామ సర్పంచులు, వార్డుమెంబర్లు, గ్రామ పెద్దలు పంచాయతీ కార్యదర్శులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఇన్‌చార్జి ఎంపీఈఓ శ్రీదేవి పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు కృషి

భోగాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై పంచాయతీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో మల్లికార్జునరావు సూచించారు. రెడ్డికంచేరు గ్రామంలో ఆయన బుధవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో గాయతి, కార్యదర్శి రాజేశ్వరి పాల్గొన్నారు.

రక్షిత నీటిని వినియోగించాలి

చీపురుపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడం వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డివిజినల్ అభివృద్ధి అధికారి ఎస్.హేమసుందర్ సూచించారు. బుధవారం ఆయన దేవరపొదిలాం గ్రామాన్ని సందర్శించారు. మురుగు కాలువలు, తాగునీటి కుళాయిలను పరిశీలించారు. గ్రామంలో చెత్త పేరుకుపోకుండా శుభ్రం చేయాలన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

క్రైం న్యూస్

పొట్టకూటి కోసం వచ్చి..

ఎక్స్‌కవేటర్ మీద పడడంతో ట్రాలీ డ్రైవర్ దుర్మరణం



ఎక్స్‌కవేటర్ కింద ఉన్న ప్రమోద్ కుమార్ మృతదేహం

మెంటాడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బతుకు తెరువు కోసం బిహార్ నుంచి వచ్చిన యువకుడిని ఎక్స్‌కవేటర్ రూపంలో మృత్యువు కబళించింది. మంగళవారం అర్ధ రాత్రి జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. అల్లూరి జిల్లా అనంతగిరి సమీపంలోని బూరిగ నుంచి మెంటాడ మండలం చీపురువలస వరకూ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు నిర్మాణం పూర్తవడంతో సంబంధిత కాంట్రాక్టర్ యంత్ర సామగ్రిని వేరేచోటకు తరలిస్తున్నారు. ఇందులో భాగంగా ఎక్స్‌కవేటర్ కూడా తీసుకువెళ్లాల్సి ఉంది. అది మరమ్మతులకు గురవ్వడంతో ట్రాలీ లారీలోకి మంగళవారం అర్ధరాత్రి వేళ ఎక్కిస్తుండగా ప్రమాదవశాత్తూ కిందకు పడిపోయింది. లారీ పక్కన ఉన్న ట్రాలీ డ్రైవర్ ప్రమోద్ కుమార్‌పై ఎక్స్‌కవేటర్ పడడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనా స్థలంలో ఉన్న మెంటాడకు చెందిన తాడి రాంబాబు అనే యువకుడి కాలు విరిగిపోయింది. మృతిచెందిన లారీ డ్రైవర్ ప్రమోద్ కుమార్ వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ప్రమోద్ కుమార్ మృతదేహాన్ని క్రేన్‌తో వెలుపలకు తీసి పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం తరలించారు. తీవ్రంగా గాయపడిన రాంబాబును చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్చారు. ప్రమోద్‌కుమార్‌ది బిహార్ రాష్ట్రం. ఎస్ఐ సీతారాం కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో కాలు విరిగిపోయిన తాడి రాంబాబు తల్లిదండ్రులు ఇదివరకే చనిపోయారు. పిన్ని దగ్గర ఉంటున్నాడు. ఈ మధ్య పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఇంతలో ఈ ప్రమాదం సంభవించడంతో బంధువులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి



పరిశ్రమ ఎదుట నిరసన తెలుపుతున్న కుటుంబ సభ్యులు



శ్రీనివాసరావు(ఫైల్)

భోగాపురం(పూసపాటిరేగ), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కందివలస సమీప పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్న వెంపడం గ్రామానికి చెందిన యువకుడు పిన్నింటి శ్రీనివాసరావు(26) ఇటీవల విధుల్లో ఉండగా స్పృహ కోల్పోయాడు. ఈమేరకు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. బంధువులు అందించిన వివరాల ప్రకారం శ్రీనువాసరావు ఓ పరిశ్రమలో కెమిస్ట్‌గా ఏడాది నుంచి విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 10న విధుల్లో ఉండగా స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో శ్రీనివాసరావును చికిత్స నిమిత్తం విజయనగరం ప్రేవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాసరావు మృతి చెందాడు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే మృతిచెందాడని మృతదేహంతో బుధవారం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పరిశ్రమ ముందు ఆందోళనకు దిగారు. అనంతరం పరిశ్రమ యాజమాన్యం, పెద్దల సమక్షంలో చర్చలు జరిపి... కుటుంబానికి నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకరించినట్టు సమాచారం. అనంతరం మృత దేహాన్ని తీసుకొని కుటుంబ సభ్యులు వెళ్లిపోయారు. మృతుడికి తల్లి రాజమ్మ ఉంది. దీనిపై ఎస్ఐ దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఆమె చూపు సజీవం

రాజాం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బొద్దాం గ్రామానికి చెందిన నక్క ఆదెమ్మ మంగళవారం రాత్రి మృతిచెందారు. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. విజయనగరం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది ఎ.రమణ, కె శంకరరావు, పి.సురేష్ తదితర సిబ్బంది వచ్చి కార్నియాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో సినీఫక్కీలో చోరీ

పార్వతీపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పట్టణ శివారు నిర్వాసిత కాలనీ సమీపంలో పార్వతీపురం-శ్రీకాకుళం రహదారిపై సినీ ఫక్కీలో బుధవారం చోరీ జరిగింది. పార్వతీపురంలో కొందరు వ్యక్తులు ఎక్కువ ఖరీదు చేసే బంగారాన్ని తక్కువ ధరకు ఇస్తున్నారని శ్రీకాకుళం జిల్లా రాగోలుకు చెందిన పొట్లూరు శ్రీలక్ష్మి అనే ఉపాధ్యాయినికి తన పూర్వ విద్యార్థి రిషికుమార్ చెప్పాడు. దీంతో బుధవారం సాయంత్రం రూ.12 లక్షల నగదుతో రాగోలు నుంచి శ్రీలక్ష్మి, రిషికుమార్ కలిసి ద్విచక్ర వాహనంపై పార్వతీపురం పట్టణ శివారుకు వచ్చారు. కొంతసేపు తరువాత ఒడిశా రిజిస్ట్రేషన్ కలిగిన కారులో కొంతమంది వ్యక్తులు వారి వద్దకు వచ్చారు. ముందు నగదు చూపించాలని, తర్వాత బంగారం ఇస్తామని వారు చెప్పారు. దీంతో శ్రీలక్ష్మి, రిషికుమార్ తమ వద్దనున్న నగదును చూపిస్తుండగా, బలవంతంగా వారి దగ్గర నుంచి నగదు సంచిని లాక్కొని కారులో పార్వతీపురం పట్టణం వైపు ఆ వ్యక్తులు వెళ్లిపోయారు. దీనిపై బాధితులు పార్వతీపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సంతోషి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



దుకాణాన్ని ఢీకొన్న వాహనం

గరుగుబిల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఉద్దవోలు సమీపంలో ఎర్రన్నగుడి సముదాయం మలుపు వద్ద బుధవారం టాటా మేజిక్ వాహనం అదుపుతప్పి బైక్‌ను, దుకాణాన్ని ఢీకొంది. ఈ ఘటనలో పెద్దూరు గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు తెర్లి అప్పలనాయుడు గాయపడ్డాడు. కాలు విరగడంతో ఆయన్ను పార్వతీపురం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉంచుతారా?.. పంపిస్తారా?

(ఐదో పేజీ తరువాయి)

సోషల్ రెస్పాన్స్‌బిలిటీ) నిధులు సుమారు రూ.10లక్షలు వెచ్చించి కిటికీలకు మెస్‌లను ఏర్పాటు చేయించారు. పూతికవలస, ముత్యాలు ఆశ్రమ పాఠశాలల విద్యార్థినులకు పరుపులు (మేట్రిస్) అందజేశారు. విశాఖపట్నం కేజీహెచ్ వైద్యాధికారులతో మాట్లాడి సీతంపేట ఐటీడీఏ పరిధిలోని సికెల్‌సెల్ ఎనీమియా రోగుల కోసం ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేయించారు. వ్యాధిగ్రస్తులకు స్థానిక వైటీసీ కేంద్రంలో సికెల్‌సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. ఈ రోగులకు రూ.10వేలు పెన్షన్ ప్రభుత్వం నుంచి మంజూరయ్యేలా చూశారు. గిరిజన విద్యా ప్రమాణాల మెరుగుకు తనవంతు కృషిచేసి, ఈ ఏడాది పదోతరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్రంలోనే సీతంపేట ఐటీడీఏ ప్రథమస్థానంలో నిలిచేలా చర్యలు తీసుకున్నారు. గిరిజన గ్రామాల్లో అంతర్గత సీసీ రహదారులు, వరద గోడల నిర్మాణాలు చేపట్టారు. భామిని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌కు 3ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు. ఆడలీ వ్యూపాయింట్‌కు వెళ్లే మార్గంలో పర్యాటకులు వరుస ప్రమాదాలకు గురౌతున్న నేపథ్యంలో రూ.1.20కోట్లతో రక్షణ చర్యలు చేపట్టారు.

యశ్వంత్‌కుమార్‌రెడ్డికే అవకాశాలు?

సీతంపేట ఇన్‌చార్జి పీవోగా సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అందించిన పాలనపై నాలుగు రోజుల కిందట ప్రభుత్వం ఐవీఆర్‌ఎస్ సర్వే చేపట్టింది. పాలనపరమైన సంస్కరణలో భాగంగా ఈ సర్వే చేసినట్లు తెలుస్తోంది. ఐటీడీఏలో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు మండలస్థాయి అధికారులకు కూడా ఐవీఆర్‌ఎస్ సర్వే కాల్స్ వచ్చాయి. యశ్వంత్‌కుమార్‌రెడ్డి పాలన ఎలా ఉంది? బాగుంటే 1నొక్కండి, బాగోలేదంటే 2నొక్కండి అంటూ ఫోన్స్ కాల్స్ కింది స్థాయి అధికారులకు వచ్చాయి. ఈ సర్వే యశ్వంత్‌కుమార్‌రెడ్డికి అనుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. చాలా మంది ఆయన పాలనపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఏదేమైనప్పటికీ సీతంపేట ఐటీడీఏ పీవోగా యశ్వంత్‌కుమార్‌రెడ్డిని రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం ఏక్షణమైనా ఆదేశాలు జారీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఆర్టీసీ బస్సుల్లో ఇక ఉచిత ప్రయాణం

(ఐదో పేజీ తరువాయి)

తగ్గిన ఆదాయం ప్రభుత్వం చెల్లించనుంది. దీంతో ప్రభుత్వంపై ప్రతినెలా రూ.4కోట్ల అదనపు భారం పడనుంది.

అంతర రాష్ట్ర సర్వీసులు మూడు మాత్రమే..

పార్వతీపురం మన్యం జిల్లాలో అంతర రాష్ట్ర సర్వీసులు మూడు మాత్రమే ఉన్నాయి. ఒడిశా రా ష్ట్రం నారాయణపట్నానికి అదే విధంగా రాయగడకు పార్వతీపురం డిపో నుంచి బస్సులు వెళుతున్నాయి. ఈ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉండదు. దీనిపై ప్రయాణికులకు ముందుగానే ఆర్టీసీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

సదుపాయాలపై దృష్టి..

స్త్రీశక్తి పేరుతో ఏపీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో మహిళలు రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించేందుకు ప్రభుత్వం చెప్పడంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నది సుస్పష్టం. ఇందుకు సంబంధించి కాంప్లెక్స్‌ల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. తాగు నీటి సదుపాయాల పెంపు, ఫ్యాన్‌ల ఏర్పాటుపై దృష్టి సారించారు. ఈ పథకంతో ఆర్టీసీ కాంప్లెక్స్‌లు ఆధునికీకరణకు, సదుపాయాల మెరుగుకు అవకాశం ఏర్పడిందని చెప్పవచ్చు.

కండక్టర్లకు బాడీవార్న్ కెమెరాలు..

బస్సుల్లో రద్దీ ఎక్కువ ఉండేటప్పుడు ఘర్షణలకు, గొడవలకు ఆస్కారం ఉండడంతో కండక్టర్‌లకు బాడీవార్న్ కెమెరాలు ఇస్తున్నారు. వాటిని దుస్తులకు అమర్చుకోవచ్చు. బస్సుల్లో సీసీ కెమెరాలు కూడా పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

ఆ బస్సుల్లో ఉచితం ఉండదు..

ప్రీమియర్ సర్వీసులుగా ఉండే నాన్‌స్టాప్, ఇంటర్ స్టేట్ ఎక్స్‌ప్రెస్‌లు, లగ్జరీ, సూపర్ లగ్జరీ, ఇంద్ర ఏసీ బస్సులకు ఈ పథకం వర్తించదు. అలాగే ఘాట్ రోడ్లలో ప్రయాణించే బస్సుల్లో సైతం ఉచిత ప్రయాణం ఉండదు. ఈ మార్గాల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తే బస్సుల్లో ప్రయాణికులు పెరుగుతారు. దీంతో ఆటంకాలు, ప్రమాదాలు జరగవచ్చునని భావించి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మొత్తం సర్వీసుల్లో 73 శాతం బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించనున్నట్టు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా అనిల్

పార్వతీపురంటౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పార్వతీపురానికి చెందిన సుంకరి అనిల్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ జి.ఆనంద్‌బాలు నుంచి నియామకపత్రాన్ని అందుకున్నారు.

కిక్ బాక్సింగ్‌లో ఆరు పతకాలు

విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ ఆవరణలో ఈ నెల 10న జరిగిన ఇన్విటేషన్ ఏపీ స్టేట్ కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్ -2025లో జిల్లాకు ఆరు పతకాలు వచ్చాయి. బి.రుత్విక మూడు బంగారు, బి.మైథిలి రెండు బంగారు పతకాలు, బి.సాత్విక బ్రాంజ్ మెడల్ సాధించింది.

జావలిన్ త్రోలో ప్రతిభ

భామిని, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి జావిలన్ త్రో పోటీల్లో భామిని ఏకలవ్య పాఠశాల విద్యార్థిని మోహిని రెండో స్థానం కైవసం చేసుకున్నట్టు ప్రిన్సిపాల్ జి.గంగాదేవి తెలిపారు. చీరాలలో జరిగిన సౌత్‌జోన్ జిల్లా స్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో మోహిని, ఇలియానా, కృష్ణవేణి పాల్గొనగా, మోహిని రాష్ట్రస్థాయిలో రెండో స్థానం కైవసం చేసుకుందని చెప్పారు. విద్యార్థులు, పీఈటీని ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

మలేరియా జ్వరాలపై అప్రమత్తం

సీతంపేట రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి):మలేరియా జ్వరాలపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి పీవీ సత్యనారాయణ సూచించారు. మర్రిపాడు పీహెచ్‌సీని ఆయన బుధవారం సందర్శించి యాక్టివ్ మలేరియా కేసులపై ఆరా తీశారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి సత్యవేణి, మలేరియా సబ్‌యూనిట్ అధికారి మోహనరావు పాల్గొన్నారు.



భామినిలో వర్షం పడుతున్న దృశ్యం

వర్షం కురిసింది

పాలకొండ/భామిని, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పాలకొండ, భామిని మండలాల్లోని భామిని, సింగిడి, దిమ్మిడిజోల, బాలేరు, ఘనసర తదితర గ్రామాల్లో బుధవారం ఉదయం వర్షం కురిసింది. గత రెండు వారాలుగా వర్షాలు లేక, వేసవిని తలపించే ఎండలతో వరి పైర్లు ఎండిపోతున్నాయి. తాజాగా కురిసిన వర్షంతో ఈ పంటలకు జీవం వచ్చింది. అయితే, ఈ వర్షం సరిపోదని అన్నదాతలు అంటున్నారు.



సీతంపేట ప్రధాన రహదారిపై పారుతున్న వరదనీరు

ఉత్సాహంగా

● జిల్లా వ్యాప్తంగా నిర్వహణ

హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు

సాలూరు/గుమ్మలక్ష్మీపురం/సీతంపేటరూరల్/ పాలకొండ/కురుపాం/ భామిని, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బుధవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు ఉత్సాహంగా జరిగాయి. ప్రజలు, విద్యార్థులు, ప్రభుత్వ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో యువత జాతీయ పతాకాలు పట్టుకొని వందేమాతరం, భారత్‌మాతాకీ జై వంటి దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీలు నిర్వహించారు. సాలూరు పట్టణంలో నిర్వహించిన హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఇంటి మీద జాతీయ పతాకం ఎగురవేయడం ద్వారా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. దేశం పట్ల ప్రతీ పౌరుడు బాధ్యతను గుర్తించాలని కోరారు. గుమ్మలక్ష్మీపురంలో బీజేపీ కన్వీనర్ అప్పలస్వామి ఆధ్వర్యంలో జరిగిన తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, ఏఎంసీ చైర్మన్ కడ్రక కళావతి, కూటమి నాయకులు పాల్గొన్నారు. సీతంపేటలో డిప్యూటీ ఎంపీడీవో కె.సత్యం, పాలకొండలో ఎంపీడీవో ఎంవీ రంగారావు, భామినిలో తహసీల్దార్ ఎస్.శివనారాయణ, ఎంపీడీవో వసంత, ఎంఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు, మానవహారం నిర్వహించారు. కురుపాంలో బీజేపీ నాయకులు, స్థానిక మహాత్మా జ్యోతి బాపూలే బీసీ బాలురు రెసిడెన్సియల్ పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకులు బాలంకి, అనిల్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.



సాలూరు: హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి తదితరులు



గుమ్మలక్ష్మీపురం: ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి తదితరులు



సీతంపేటలో..



పాలకొండలో..



కురుపాంలో..



భామినిలో..

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

● చినమేరంగి సీఐ తిరుపతిరావు

జియ్యమ్మవలస, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే మనందరి ముందున్న ప్రధాన లక్ష్యమని చినమేరంగి సీఐ టీవీ తిరుపతిరావు అన్నారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో పెదమేరంగి కూడలి వద్ద విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్‌తో కలిగే అనర్థాలను వివరించేందుకు ప్రతీ గ్రామ, వార్డుల్లో ర్యాలీలు నిర్వహిస్తామని సీఐ అన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం, రవాణా వంటివి జరిగితే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చినమేరంగి ఎస్ఐ పి.అనీష్, చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సవరపు రవణ, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

● పాలకొండ: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పాలకొండ సీఐ చంద్రమౌళి, ఎస్ఐ ప్రయోగమూర్తి సూచించారు. యాంటీ డ్రగ్స్‌పై బుధవారం పాలకొండ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

● వీరఘట్టం: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎస్ఐ జి.కళాధర్ అన్నారు. వీరఘట్టంలో బుధవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ జంక్షన్ వద్ద మానవ హారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు.

● సీతంపేట రూరల్:మాదకద్రవ్యాల నిర్మూలనకు అందరూ సహకరించాలని ఎస్ఐ వై.అమ్మనరావు అన్నారు. బుధవారం సీతంపేటలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● పార్వతీపురంటౌన్: మాదక ద్రవ్య రహిత దేశమే మనందరి లక్ష్యమని స్థానిక పభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆకుల రాజు అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులతో ప్రమాణం చేయించారు.

● కురుపాం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.కుమారస్వామి అన్నారు. బుధవారం కళాశాలలో ఎస్ఐ నారాయణరావు ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ నిర్వహించారు.

● కొమరాడ: కొమరాడ జంక్షన్ వద్ద బుధవారం ఎస్ఐ నీలకంఠం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్. సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● సీతానగరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులతో బుధవారం ఎస్ఐ ఎం.రాజేష్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ ఎం.దాలినాయుడు, ఎన్ఎస్ఎస్ పీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పెదమేరంగి కూడలిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ తిరుపతిరావు తదితరులు

పీఏసీఎస్‌లు రైతులకు అండగా ఉండాలి

● మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతులకు అండగా ఉండాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని శ్యామలాంబ ఆలయంలో బుధవారం నిర్వహించిన సాలూరు పీఏసీఎస్ చైర్మన్, మెంబర్ల ప్రమాణస్వీకార కార్యక్రమానికి మంత్రి సంధ్యారాణి హాజరై మాట్లాడారు. పీఏసీఎస్ వ్యవస్థ రైతుల హక్కులను కాపాడడం, వారి సంక్షేమాన్ని పెంపొందించడం, గ్రామీణ ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు ఒక ముఖ్యమైన పరిష్కార మార్గమన్నారు. రైతుల అభివృద్ధి కోసం మనమంతా కలిసి పనిచేయాలని ఆమె కోరారు. సాలూరు పీఏసీఎస్ చైర్మన్‌గా నక్కెళ్ల రమణ, మెంబర్లుగా గాడి లక్ష్మణరావు, మీసాల నవీన్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఐటీడీఏలకు పూర్తిస్థాయి పీవోలను నియమించాలి

గుమ్మలక్ష్మీపురం/కురుపాం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం, పాలకొండ డివిజన్ల సబ్ కలెక్టర్లుగా బాధ్యతలు చేపట్టి, ఐటీడీఏ పీవోలుగా అదనపు బాధ్యతలు స్వీకరించిన అశుతోష్ శ్రీవాత్సవ, యశ్వంత్‌కుమార్‌డ్డికి బదిలీ అయిన నేపథ్యంలో వారిని పూర్తిస్థాయి ప్రాజెక్టు అధికారులుగా నియమించాలని ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. అశుతోష్ శ్రీవాత్సవ , యశ్వంత్‌కుమార్‌ను మరో ఏడాది కాలం ప్రాజెక్టు అధికారులుగా కొనసాగిస్తే గిరిజన అభివృద్ధి తథ్యమని అన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

జియ్యమ్మవలస, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): చినమేరంగి, బీజేపురం పీఏసీఎస్‌లలో సభ్యులకు సమాచార హక్కు చట్టం - 2005పై బుధవారం అవగాహన సదస్సులు జరిగాయి. చినమేరంగి పీఏసీఎస్‌లో సీఈవో సామల పోలిరాజు, బీజే పురం పీఏసీఎస్‌లో సీఈవో చీపురుపల్లి తిరుపతిరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాచార హక్కు చట్టంతో కలిగే ఉపయోగాలేమిటి, ఏ సమాచారం ఎవరి వద్ద తీసుకోవాలి, తదితర అంశాలను సభ్యులకు వివరించారు.

● పాలకొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార సంఘం అధికారి ఆదేశాల మేరకు బుధవారం పాలకొండ కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో సభ్యులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. సంఘం జీసీవో బీవీ రామారావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ పి.సాయికుమార్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు

గరుగుబిల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థిని, విద్యార్థులు సోదర, సోదరి భావంతో మెలగాలని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు సూచించారు. బుధవారం ఉల్లిభద్ర సమీపంలోని వైఎస్‌ఆర్ ఉద్యాన కళాశాల ఆవరణలో ర్యాగింగ్‌తో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తోటి విద్యార్థులను పలు రకాల హింసలకు గురిచేస్తే 1997 చట్టం మేరకు తగిన చర్యలు తప్పవన్నారు. విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకునేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మత్తు మందులకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను పాడు చేసుకోవద్దని అన్నారు. అనంతరం పలు రకాల చట్టాలపై అవగాహన కల్పించారు. వివిధ పోటీలను నిర్వహించి ప్రతిభ కనపర్చిన వారికి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి'పై సమాచారం సేకరణ

గరుగుబిల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం పనులు ఏ మేరకు జరిగాయి, కూలీల సగటు వేతనం తదితర అంశాలపై బుధవారం సామాజిక సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సమాచారాన్ని సేకరించారు. 19వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా ఈ సమాచారాన్ని సేకరిస్తున్నట్లు ఎస్‌ఆర్‌పీ పున్నపునాయుడు తెలిపారు. మండలానికి సంబంధించి సుమారు రూ.20 కోట్లు ఉపాధి పనులకు వ్యయం చేశారన్నారు. ఈ నెల 22న మండల కేంద్రంలో ప్రజావేదిక జరగనుందని తెలిపారు.

ఎరువుల ధరలు పెంచితే చర్యలు

సీతంపేట రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ డీలర్లు యూరియా, డీఏపీ వంటి ఎరువుల ధరలను పెంచి విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీకన్య హెచ్చరించారు. సీతంపేటలోని ఎరువుల దుకాణాలను ఆమెతో పాటు , వ్యవసాయశాఖాధికారి వై.వాహిణి బుధవారం తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, రికార్డులు, బిల్లులు పరిశీలించారు. ప్రభుత్వం ప్రకటించిన ధరకు మాత్రమే ఎరువులను విక్రయించాలని వ్యాపారులను ఆదేశించారు.

కురుపాంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

కురుపాం, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): కురుపాం 8, 9, 48వ బూత్‌ల్లో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ కె.వి.కొండయ్య, తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి సుకేష్ చంద్రపండా ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, అమలు చేసిన పథకాలను వివరించారు.

ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేయాలి

పాలకొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఉన్న 8 వేల ఖాళీలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని ఎన్ఎంయూఏ విజయనగరం జోన్-1 సభ్యులు, సీసీఎస్ డెలికేట్ మాడుగుల వైకుంఠం అన్నారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పాలకొండ డిపో వద్ద రెండో రోజు ఎన్ఎంయూ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ యాజమాన్యానికి ఉద్యోగుల ఇబ్బందులను ఎన్నోసార్లు తెలియజేసినా కనీస స్పందన లేదన్నారు. తీవ్రమైన అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలని, ఉద్యోగుల అవసరాన్ని బట్టి ఈహెచ్ఎల్‌ను మంజూరు చేయాలని అన్నారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి వావిలపల్లి రాజేష్, జేఎస్.చలం, కె.తౌడు, ఎ.కృష్ణ, టి.ధర్మాంబ, జి.మంగ, జీకేవేణి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

రైతులకు కేంద్ర ప్రభుత్వం ద్రోహం



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

బెలగాం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం రైతులకు ద్రోహం చేస్తోందని రైతు, రైతు కూలి, ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. రైతు వ్యతిరేక విధానాలు విడనాడాలని, కార్మిక నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ సంస్థలను తీసుకొచ్చే ఆలోచనలు మారాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బంటు దాసు, ఈవీ నాయుడు, ఆర్వీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫారం పంపిణీ

కొమరాడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అర్తాం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం ఎంఈవో-2 చినతిరుపతిరావు తెలుపు రంగు యూనిఫారం పంపిణీ చేశారు. ఈ యూనిఫారాన్ని పార్వతీపురం పట్టణానికి చెందిన స్వామి అయ్యప్ప క్లాత్ స్టోర్స్, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రచారకుడు కె.రామ్మోహనరావు అందజేశారు. హెచ్ఎం గౌరీశంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజనుల హర్షం

కొమరాడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వడేసు పంచాయతీ గుమడింగిలో పాఠశాలను ఏర్పాటు చేయడంతో పాటు ఉపాధ్యాయుడిగా రామారావును నియమించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామంలో 25 మంది పిల్లలు ఉన్నారని, పాఠశాలను ఏర్పాటు చేసి ఉపాధ్యాయుడిని నియమించాలని తల్లిదండ్రులతో పాటు గ్రామ వార్డు మెంబర్ ఆరిక నాగేశ్వరరావు, గిరిజన సంఘం నాయకుడు హిమరిక ఫకీరు, సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకుడు రామారావు తదితరులు ఇటీవల కలెక్టర్, ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందించారు. ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకోవడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు

కొమరాడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్టు 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు రూ.2 కోట్ల విలువైన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైంది. ఈ నెల 20వ తేదీ నాటికి ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చి ప్రజలకు, రైతులకు విద్యుత్ సమస్యలు లేకుండా చేయాలని విద్యుత్ శాఖాధికారులను ఎమ్మెల్యే జగదీశ్వరి ఆదేశించారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం రాష్ట్ర తూర్పు కాపు అభివృద్ధి డైరెక్టర్ శేఖర్‌పాత్రుడు, అధికారులు పరిశీలించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

వీరఘట్టం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కిమ్మి గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని డీపీవో కొండలరావు బుధవారం పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. పొడి చెత్త, తడిచెత్త వేరు చేసి సేకరించాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గురాన రామ్మోహన్, ఎంపీడీవో శంకరరావు, పంచాయతీ కార్యదర్శి తిరుపతిరావు పాల్గొన్నారు.

జీతాలు పెంచాలి

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తల మాదిరిగానే గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు జీతాలు పెంచాలని గిరిజన సంక్షేమ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజన ప్రాంతంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు అనేక అవస్థలు పడుతూ వైద్య సేవలు అందిస్తున్నారని, వారు చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వారి సేవలకు సరైన గుర్తింపు ఇవ్వాలని అన్నారు.

వీఆర్ఎస్ నుంచి నీరు విడుదల

మక్కువ రూరల్,ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): వెంగళరాయసాగర్ (వీఆర్ఎస్) జలాశయం నుంచి మిగులు జలాలను బుధవారం గోముఖి నదిలోకి విడిచి పెట్టారు. గోముఖి నది పరివాహక ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురవడంతో నదిలోకి వరద నీరు వచ్చి చేరుతోందని ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్ కుమార్ తెలిపారు. దీంతో 300క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచి పెట్టినట్లు చెప్పారు.

నేడు సర్వసభ్య సమావేశం

మక్కువ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మక్కువ మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో స్వరూపరాణి తెలిపారు. ఎంపీపీ మర్రి పారమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికారులు, సభ్యులు హాజరుకావాలన్నారు.

జాతీయ జెండా ఎగురవేయాలి

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను ఇళ్లపై ఎగురవేయాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీవరం పిలుపునిచ్చారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఎల్విన్‌పేట సెంటర్ వద్ద మానవహారం చేపట్టారు. ఎన్ఎస్ఎస్ పీవో, వైస్ ప్రిన్సిపాల్ రామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.